సాక్షి తిరుపతి

గురువారం, 10, అక్టోబర్, 2024



ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం

చిల్లకూరు పంచాయతీలో బందెలదొడ్డిలోని పెడ్ కూల్చి,టీడీపీ నేతల అండతో ఆక్రమించుకుని, పనులు చేపట్టారు. - 10లో



విత్తన దుకాణాల్లో తనిఖీలు

నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాల్లో వ్యవసాయాధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. - 10లో



రామదూత..గజగోవిందం

తుమ్మలగుంటలోని కల్యాణవేంకటేశ్వరస్వామి బుధవారం హనుమంత, గజవాహనాలపై విహరించారు. - 10లో

న్యూస్‌రీల్

మహిళా వర్సిటీలో కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతీ మహిళా యూనివర్సిటీలో పలు యూజీ కోర్సులకు గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సువర్ణలతాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా యూజీ కోర్సుల్లో ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ, ఒకేషనల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్‌కేర్ సైన్స్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అపెరల్ డిజైన్, బ్యాచులర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్టాటిస్టిక్స్, బ్యాచులర్ ఆఫ్ సోషియల్ వర్క్, మాస్టర్ ఇన్ ఫైన్‌ఆర్ట్స్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

పంచాయతీ వారోత్సవాలకు వెళదాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పల్లె పండుగ పేరున ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న పంచాయతీ వారోత్సవాలకు వెళదామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతోపాటు డివిజన్, మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఏఏ పనులు చేయాల్సి ఉంది.. ఎప్పటిలోగా చేయడానికి వీలుంటుంది.. ఎంత మొత్తం ఖర్చు చేయాలన్న అంశాలను స్పష్టంగా వెల్లడించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి, డ్వామా పీడీ, గ్రామీణ నీటిపారుదల ఇంజినీర్లు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ సిబ్బంది, ఎంపీడీఓలు సమష్టిగా పనిచేయాల్సి ఉందన్నారు. ఆయా పంచాయతీల్లో రోడ్లు, తాగునీటి వసతులు, శ్మశాన వాటికలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని చెప్పారు. ఆ మేరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న పల్లె పండుగ వారోత్సవాలను పండుగ వాతావరణంలో చేపట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శ్మశానవాటికపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సుశీలాదేవి, డ్వామా పీడీ, శ్రీనివాస ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బీ ఫార్మసీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాదిలో జరిగిన బీ ఫార్మసీ మూడో సెమిస్టర్, డీపీఈడీ రెండో సెమిస్టర్, మాస్టర్ ఆఫ్ డేటా సైన్స్ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

మరో రెండు రోజులు చాన్స్

- 227 మద్యం దుకాణాలకు 2250 దరఖాస్తులు

తిరుపతి క్రైం: మద్యం కొత్త పాలసీలో ప్రైవేటు వ్యాపారులు దుకాణాలను పొందడానికి మరో రెండు రోజులు గడువు పెంచినట్లు ఆ విభాగం అధికారులు వెల్లడించారు. దరఖాస్తులకు బుధవారం సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే గడువు ఉంది. అయితే దసర సెలవుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువును పెంచారు. అప్పటిలోగా దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అనంతరం ఈ నెల 14వ తేదీ ఉదయం తిరుచానూరు శిల్పారామంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ నేతృత్వంలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను ఎంపిక చేయనున్నారు. జిల్లాలో 227 మద్యం దుకాణాలకు సంబంధించి బుధవారం వరకు 2,250 దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 15వ తేదీ నుంచి ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోకి మద్యం దుకాణాలు వెళ్లనున్నాయి. ఆ మేరకు వారు దుకాణాలు నిర్వహించనున్నారు.

ఏర్పేడు ఎస్‌ఐ రహీం రెడ్డి సస్పెన్షన్

తిరుపతి క్రైం/ఏర్పేడు: అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఏర్పేడు ఎస్‌ఐ కే.రహీంరెడ్డిని సస్పెండ్ చేస్తూ బుధవారం తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ కే రహీంరెడ్డి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, అవినీతి కార్యకలాపాలకు పాల్పడినట్లు రుజువుకావడం, దుష్ప్రవర్తనతో పోలీస్ శాఖ ప్రతిష్టతకు భంగం కలిగించినట్లు విచారణలో తేలిందని ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. దీంతో క్రమశిక్షణా చర్యలో భాగంగా సదరు ఎస్‌ఐను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

తేజోమూర్తి.. స్వర్ణకీర్తి



స్వర్ణరథంలో విహరిస్తున్న మలయప్పస్వామి (ఇన్‌సెట్) హనుమంత, గజవాహనాలపై శ్రీవారు



భక్తుడంటే అంజనీ సుతుడిలా ఉండాలి.. దాసభక్తిని చాటుకోవాలి..కనుసంజ్ఞల్లో మెలగాలి.. ఇవీ హనుమంతుడి సుగుణాలు.. అలాంటి త్రేతాయుగం నాటి విశేషాలు తిరుమల క్షేత్రంలో సాక్షాత్కరించాయి. గజేంద్ర మోక్షం..దివ్యప్రబోధ గీతం.. సరస్సులో దిగిన కరి.. శ్రీహరిని ప్రార్థిస్తూ ఇక కలవో..లేవో అంటూ నిష్ఠూరమాడిన వేళ ఆ దేవదేవుడు చెలికి చెప్పకుండానే ఇలకు చేరిపోయాడు. భక్తవరేణుడైన గజేంద్రుడిని మొసలి బంధనాల నుంచి విముక్తి కల్పించాడు. శరణుగోరిన వారికి నిత్యరక్షకుడిగా ఉంటానని సందేశమిచ్చాడు. ఆ భాగవత గాథ సాక్షాత్కరిస్తూ శ్రీవారు మాడవీధుల్లో దర్శనమిచ్చారు. వాసుకి, సూర్యచంద్రులు, శ్రితపరిపాలకుడిని మోసి తరించారు. తానేమీ తక్కువ కాదని ఆ వైకుంఠవాసుడికి స్వర్ణ రథమూ సేవలందించింది. ఇదీ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలలో బుధవారం జరిగిన వైభవోత్సవం.

వైభవోత్సవం

- మూడు వాహనసేవల్లో మురిపించిన ముగ్ధమనోహరుడు
- ఉదయం హనుమంత, సాయంత్రం స్వర్ణరథోత్సం, రాత్రి గజవాహనంపై మలయప్ప





తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువలా సాగుతున్నాయి. బుధవారం ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజవాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తకోటిని కటాక్షించారు. దేవదేవుని దివ్యమంగళరూపాన్ని దర్శించుకున్న భక్తులు దివ్యానుభూతిని పొందారు. ఉదయం హనుమంత వాహనంలోనూ భక్తుల సందడి కనిపించింది. సాయం సంధ్యవేళ స్వర్ణ రథోత్సవంలో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, తన్మయత్వం పొందారు. రాత్రి గజవాహనం కూడా భక్తుల కోలాహలం మధ్య సాగింది. వాహన సేవల్లో కళాకారుల నృత్యాలు, కోలాటాలు, భజన బృందాల సందడి కనిపించింది. కళాకారుల విభిన్న కళా ప్రదర్శనలు భక్తులను కట్టిపడేస్తున్నాయి. భద్రతా సిబ్బంది హడావుడి ఏమాత్రం తగ్గలేదు. తిరుమలలో పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు, టీటీడీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శనశాలకు భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. ఫొటో ఎగ్జిబిషన్‌కు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. అలాగే, నాదనీరాజనం, ఆస్థాన మండపం వేదికలపై సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు కోలాహలంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు పాల్గొన్నారు.



స్వర్ణరథం

శ్రీనివాసుడు ధగధగా మెరిసిపోతున్న స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడు. స్వర్ణరథం శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమైనది. స్వర్ణమయమైన రథంలో శ్రీభూదేవేరులతో మలయప్ప దర్శనమిస్తాడు.





శ్రీమహావిష్ణువుకు నాట్యకళారాధన





వాహనసేవలో కళాకారుల నృత్య ప్రదర్శన

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 82,043 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,100 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేస్తోంది.

నేడు ఆధార్ ప్రత్యేక శిబిరాలు

తిరుపతి(అలిపిరి): జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఈనెల 10వ తేదీన అంత్యోదయ దివస్‌ను పురస్కరించుకుని ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు జిల్లా తపాలా కార్యాలయ సూపరింటెండెంట్ నరసప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ నమోదు, సవరణ, ఫోన్ నంబర్ లింక్, చిరునామా మార్పు, బయోమెట్రిక్ అప్డేషన్ తదితర ఆధార్ సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. తిరుపతి డివిజన్ పరిధిలోని గుర్రంకొండ, పాకాల, రేణిగుంట, శ్రీ సిటీ, పుత్తూరులోని ఉప తపాలా కార్యాలయాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్లెవించిన ప్రగతి

వ్యాపారం.. లాభార్జనే ధ్యేయం.. అయితే దేశానికి పట్టుగొమ్మలు పల్లెటూళ్లు అన్న భావనతో సేవలకు ముందడుగు. సమాజాభివృద్ధికి బాటలు.. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న పేద పిల్లల విద్యాభివృద్ధి.. సామాన్యుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తోంది శ్రీసిటీ. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిబంధనలను తూ.చ.తప్పకుండా పాటిస్తోంది. ఆ పరిసర గ్రామాల ప్రగతికి కృషి చేస్తోంది.

- శ్రీసిటీ పరిసర గ్రామాల్లో విద్య, వైద్యానికి చేయూత
- సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ప్రభుత్వ నిబంధనల మేరకు ఏదైనా పరిశ్రమ ఏర్పాటైతే ఆ పరిశ్రమ అభివృద్ధి, వార్షిక ఆదాయంలో కొంతమేరకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) ద్వారా ప్రజా అవసరాలకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. ఆ నిబంధనలను శ్రీసిటీ పరిశ్రమలు తూ.చా. తప్పకుండా అమలు చేస్తున్నాయి. అటు శ్రీసిటీ ఫౌండేషన్, ఇటు శ్రీసిటీ పరిశ్రమల సీఎస్‌ఆర్ నిధుల ద్వారా పరిసర ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటునిస్తున్నాయి. ఇందు లో ప్రధానంగా గ్రామీణ విద్య, వైద్య వసతుల పెంపునకు పెద్దపీట వేస్తున్నాయి. ఆ దిశగా ఇప్పటికే శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని 16 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశాయి. వీటితో పాటు సత్యవేడు కమ్యూనిటీ హాస్పిటల్, సూళ్లూరుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పలు మౌలిక వసతులు, పరికరాల పంపిణీ చేసి పేదల ఆరోగ్యానికి అండగా నిలిచారు శ్రీసిటీ పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులు.



గొల్లవారిపాళెంలో నిర్మించిన నూతన అంగన్‌వాడీ కేంద్రం



ఇరుగుళం హైస్కూల్‌లో ఐమాప్ పరిశ్రమచే నిర్మించిన నూతన తరగతి గదులు

రూ.2 కోట్లతో ఇరుగుళం జెడ్పీ హైస్కూలు అభివృద్ధి

సత్యవేడు మండలంలోని ఇరుగుళం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల పరిస్థితి పదేండ్ల క్రితం అధ్వానంగా ఉండేది. ఈ నేపథ్యంలో శ్రీసిటీ ఫౌండేషన్ వారు పాఠశాలలను సందర్శించి అభివృద్ధికి ముందుకొచ్చారు. దీంతో తరగతి గదులకు మరమ్మతుతోపాటు 10 నూతన తరగతి గదులను నిర్మించారు. మరుగుదొడ్లు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ లు, తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలు, లైబ్రరీ ఇలా రూ. 2 కోట్లతో అన్ని హంగులతో కూడిన ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేశారు.

శ్రీసిటీ ఆవిర్భావం ముందు నుంచే..

2008లో శ్రీసిటీ ఏర్పాటుకు ముందు నుంచే శ్రీసిటీ ఫౌండేషన్ పేరిట శ్రీసిటీ యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మానవ వనరుల అభివృద్ధి కేంద్రాన్ని స్థాపించి విద్యార్హత అంతగా లేని శ్రీసిటీ పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు వివిధ చేతివృత్తులు, విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించింది. పలు ప్రభుత్వ, ప్రైవేటు వృత్తి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారికి తగు శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాలను కలుగజేసింది.

16 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

శ్రీసిటీ పరిధిలోని సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన 16 ప్రభుత్వ పాఠశాలల్లో సీఎస్‌ఆర్ ద్వారా అభివృద్ధి చెందాయి. మాదనపాళెం, పాండూరు హైస్కూళ్లు, మోపూరుపల్లి, తొండూరు, తొండూరు సొసైటీ, శ్రీహరికోటకాలనీ, చెంగంబాకం, మల్లవారిపాళెం ఈస్ట్, వెస్ట్, ఇరుగుళం, గొల్లవారిపాళెం, సిద్దమగ్రహారం, కొల్లడం, మత్తేరిమిట్ట, చెరివి ప్రాథమికోన్నత పాఠశాలలు రూ. కోటిన్నరకు పైగా సీఎస్‌ఆర్ నిధులతో పలు మౌళిక వసతులు, తరగతి గదులను ఏర్పాటు చేశారు.

మరికొన్ని సేవా కార్యక్రమాలివీ..

శ్రీసిటీ మెడికల్ సెంటర్, సత్యవేడు, సూళ్లూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాలలకు రూ.90 లక్షలతో 3 అంబులెన్స్‌లు, వాహనాల వితరణ.

- రూ. 35లక్షలతో గొల్లవారిపాళెంలో నూతన అంగన్‌వాడీ భవనం
- రూ. 14లక్షలతో తడ ఐటీఐ కాలేజీ భవనం మరమ్మతు
- రూ.30 లక్షలతో సత్యవేడు కమ్యూనిటీ ప్రభుత్వ వైద్యశాలకు వైద్య పరికరాలు అందజేత
- రూ.5లక్షలతో చిన్న పాండూరు పీహెచ్‌సీకి వైద్య పరికరాల పంపిణీ
- రూ. 30లక్షలతో సత్యవేడు ప్రభుత్వ బాలుర హైస్కూల్, కళాశాలల్లో వసతులు
- రూ.5లక్షలతో సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పలు సాంకేతిక యంత్ర సామగ్రి వితరణ
- విద్యార్థులకు క్రీడా పరికరాలు, విద్యా సామగ్రి వితరణ
- దివ్యాంగులకు రూ. 15లక్షలు విలువైన వీల్ చైర్లు, ట్రైసైకిళ్ల పంపిణీ

పేదల ఆరోగ్యానికి పెద్దపీట



చిన్న పాండూరు పీహెచ్‌సీ అభివృద్ధికి అడిగిన వెంటనే శ్రీసిటీ ఇసుజు పరిశ్రమ చేయూతనిచ్చింది. రూ.5 లక్షల వ్యయంతో పలు వైద్య పరికరాలను వితరణగా అందజేసింది. వారు అందజేసిన పరికరాలు పేదల వైద్యానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేసి, చేయూతనిచ్చిన శ్రీసిటీ పరిశ్రమలకు కృతజ్ఞతలు.

– అనిత, వైద్యాధికారి, చిన్న పాండూరు

శ్రీసిటీ తోడ్పాటు ఆదర్శనీయం



మాదనపాళెం జెడ్పీ హైస్కూలు అభివృద్ధిలో శ్రీసిటీ పరిశ్రమల తోడ్పాటు ఆదర్శనీయం. 5 డిజిటల్ బోర్డులు, 30 డెస్కులు, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్, మరుగుదొడ్ల నిర్మాణం ఇలా అనేక వసతులు సమకూర్చడంతో పాటు పాఠశాల అభివృద్ధికి సీఎస్‌ఆర్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. శ్రీసిటీ ఫౌండేషన్ వారి స్ఫూర్తిదాయకంతో పేద పిల్లలు చదివే మా పాఠశాలలో విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతాం.

–మునిమోహన్, హెచ్‌ఎం, మాదనపాళెం హైస్కూల్

మా పాఠశాలకు అన్ని హంగులు



ఇరుగుళం జెడ్పీ హైస్కూలు శ్రీసిటీ ఫౌండేషన్, సీఎస్‌ఆర్ నిధులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అన్ని హంగులతో ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చెందింది. 10 నూతన గదులు, ఆధునిక విద్యాబోధనకు 7 డిజిటల్ బోర్డులు, పిల్లల కోసం క్రీడా మైదానం, కంప్యూటర్ ల్యాబ్ ఇలా అన్ని రకాల వసతులతో పాఠశాల అభివృద్ధి చెందింది. తమ పాఠశాల అభివృద్ధికి దోహదపడిన శ్రీసిటీ పరిశ్రమలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– మొహిద్దీన్, హెచ్‌ఎం, ఇరుగుళం హైస్కూల్



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.77,230
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,030
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.91,000
రిటైల్ వెండి గ్రాము	రూ.94.00

క్లుప్తంగా

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాదిలో జరిగిన బీ ఫార్మసీ మూడో సెమిస్టర్, డీపీఈడీ రెండో సెమిస్టర్, మాస్టర్ ఆఫ్ డేటా సైన్స్ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


కార్తీక్(ఫైల్)

కోట: విద్యానగర్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో కోటకు చెందిన కార్తీక్(20) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం మేరకు.. స్థానిక మహాలక్ష్మమ్మ వీధిలో నివాసం ఉంటున్న ప్రసాద్, సురేఖ దంపతుల కుమారుడు కార్తీక్ తన స్నేహితుడు శ్రీనివాసులుతో కలసి విద్యానగర్‌కు పల్సర్ మోటార్‌బైక్‌లో వెళుతుండగా పెట్రోల్‌బంక్ వద్ద ఆటోను తప్పించబోయి మోటార్‌బైక్ అదుపుతప్పింది. పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాంత్‌ను గూడూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన శ్రీకాంత్ కరెంటు పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడువాదుడుగా ఉండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానిక మహాలక్ష్మమ్మ వీధిలో విషాద చాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రామదూత.. గజగోవిందం


హనుమంత వాహనంపై శ్రీవారు


వాహన సేవలో వసంతాలు చల్లుకుంటున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


గజవాహనంపై కల్యాణవేంకటేశ్వరస్వామి

హనుమంత, గజవాహనాలపై శ్రీహరి వైభవం

- అలరించిన కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- శ్రీవారిపై భక్తితో సారె సమర్పించిన చంద్రగిరి భక్తులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు హనుమంత వాహనంపైన, రాత్రి 7 నుంచి 10 గంటల వరకు గజవాహనంపైన శ్రీ మలయప్ప స్వామి వారు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడిగా, నవవ్యాకరణ పండితుడిగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రివాసుని మూపున వహించి గ్రామంలో దర్శనమివ్వడం భక్తులను ఆనందపరవశులను చేసింది. గురుశిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వవివేచనగావించిన మహనీయుడు. అందుకే వాహ్యావాహకరూపంలో ఈ ఇరువురినీ చూసిన వారికి వేదాలతత్వం ఒనగూరుతుంది. గజవాహనంపై కొలువుదీరి కదలివచ్చే శ్రీవారిని దర్శించుకుంటే కర్మ విముక్తి కలుగుతుందని పురాణాల ద్వారా తెలుస్తోంది. పద్మావతి అమ్మవారికి సేవలందించే గజరాజులను తన వాహనంగా చేసుకున్న శ్రీపతి, తనను ఆశ్రయించిన వారికి అమ్మవారి అనుగ్రహం కూడా లభిస్తుందని, దీర్ఘకాలం పట్టిపీడిస్తున్న కష్టాలు సైతం దూరం అవుతాయని ఈ వాహన సేవ ద్వారా తెలియజేశారు. మొసలి చేతికి చిక్కిన గజరాజును కాపాడటానికి వైకుంఠం నుంచి ఎవరికీ చెప్పకుండా, ఆయుధాలు ధరించకుండా కదలివచ్చిన శ్రీ మహావిష్ణువు సంసార సాగరంలో చిక్కిన వారు తనను సంపూర్ణ విశ్వాసంతో పిలిస్తే పలుకుతానంటూ తెలియజేయడమే ఈవాహనసేవ పరమార్థమని పండితులు తెలిపారు. రాజులను పట్టాభిషేకాది సమయాల్లో గజాలపై ఊరేగిస్తారు. ఒక విశిష్టమైన వ్యక్తిని ఘనంగా సన్మానించాలంటే గజారోహణం చేసే ప్రక్రియ నేటికీ ఉంది. శ్రీ వేంకటేశ్వర స్వామి గజవాహనరూఢుడై తిరగడం భక్తులకు మరపురాని దృశ్యం. కాగా చంద్రగిరి మండలం నుంచి తొండవాడ, శానంబట్ల, పిచ్చినాయుడు పల్లి, గంగుడుపల్లి, దోర్నకంబాల పంచాయతీలకు చెందిన భక్తులు శ్రీవారిపై భక్తితో సారెను తీసుకువచ్చారు. సారె తెచ్చిన భక్తులకు గ్రామ శివార్ల నుంచి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సాదరంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం అందరికీ దగ్గరుండి అల్పాహారం వడ్డించి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనుల పండువగా స్నపన తిరుమంజనం

హనుమంత వాహన సేవ ముగిసిన తరువాత కల్యాణ మండపంలో జరిగిన స్నపన తిరుమంజనం కనులపండువగా సాగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచామృతం, గంధం, పసుపు, కుంకుమలతో పాటు పంచగవ్య సుంగధ భరిత పరిమళాలతో కూడిన ద్రవ్యాలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ తిరుమంజన సేవ వైభవంగా జరిగింది.

అలరించిన ప్రదర్శనలు

హనుమంత వాహనం, గజ వాహన సేవల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. దేవతా మూర్తుల కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు దేవతా మూర్తుల వేషధారణలు ధరించి వాహనం ముందు వెళుతుండగా భక్తులు వారితో కలసి సెల్ఫీలు తీసుకుని భక్తితో నమస్కరించారు.

పింఛన్లపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల తొలగింపు, కొత్త పింఛన్ల మంజూరు చేయకపోవడంపై కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆరా తీస్తున్నారు. ఈ నెల 30వ తేదీన ప్రతి నెలా ఏడిపింఛన్ అనే శీర్షికతోపాటు, కొత్త పింఛన్ల సంగతేంటి బాబు అనే శీర్షిక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ పింఛన్లకు సంబంధించి డీఆర్‌డీఏ అధికారులను వివరణ కోరారు. దీంతో డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని, వచ్చిన వెంటనే అర్హులైన అందరికీ అందిస్తామని కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు.

జాతీయస్థాయి పోటీలకు శ్రీకాళహస్తి విద్యార్థిని


పసుపులేటి ఉమ

శ్రీకాళహస్తి: జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరపున పాల్గొనే జట్టులో శ్రీకాళహస్తికి చెందిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని పసుపులేటి ఉమ చోటు దక్కించుకుంది. విశాఖ జిల్లా వనపర్తి వేదికగా ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన అంతర్ జిల్లాల జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఉమ విశేష ప్రతిభ కనబరచింది. జాతీయస్థాయిలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఉమను ప్రిన్సిపల్ రాజశేఖర్, పీడీ నరసింహారావు, కోచ్ స్వప్న అభినందించారు.

బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

చౌడేపల్లె: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బోయకొండ గంగమ్మకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే దంపతులు బోయకొండకు బుధవారం ఉదయం రాగా ఆలయ మర్యాదల ప్రకారం మేళతాళాల నడుమ వేదపండితులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయంలో సరస్వతిదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారికి పెద్దిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన గర్భాలయం కింద ఉన్న మూలస్థానం, రణభేరి గంగమ్మ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు పూజలు చేశారు. వేదపండితులచే పెద్దిరెడ్డి దంపతులతో పాటు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డికి ఆశీర్వాదాలు అందించారు. అనంతరం ఈఓ అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లె, సదుం జెడ్పీటీసీ సభ్యులు దామోదరరాజు, సోము శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు మిద్దింటి శంకర్ నారాయణ, నాగరాజారెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, రెడ్డిప్రకాష్, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

రుయాలో అరుదైన వ్యాధికి శస్త్ర చికిత్స


రోగి రమణయ్యతో డాక్టర్ల బృందం

తిరుపతి తుడా: రుయాస్పత్రిలో నెల్లూరు జిల్లాకు చెందిన రమణయ్య ఊపిరితిత్తుల్లో ఫంగల్ బంతి ఏర్పడడంతో రోగికి ఎటువంటి ప్రాణపాయం లేకుండా ఫంగల్ బంతిని డాక్టర్లు తొలగించి, అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఇలాంటి వ్యాధి అరుదుగా సంభవిస్తుందని రుయా డాక్టర్లు చాకచక్యంగా వ్యవహరించి, శస్త్ర చికిత్సను విజయవంతం చేశారని సూపరింటెండెంట్ హర్షం వ్యక్తం చేశారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ కళ్యాణి రమ, డాక్టర్ జే రాధ, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ పి శ్రీనివాస్, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ ఈఆర్ హరికృష్ణ డాక్టర్లను అభిందించారు.

బాలుడికి కన్నీటి వీడ్కోలు


బాలుడి అంత్యక్రియలకు వచ్చిన వరగలి గ్రామస్తులు

చిల్లకూరు : కండలేరు క్రీక్‌లో శవమై తేలిన వరగలికి చెందిన చిన్నారి లాసిక్(12) మృతదేహానికి బుధవారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడి మృతదేహాన్ని చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడికి అంతిమ వీడ్కోలు పలికి అంత్యక్రియలు నిర్వహించారు. గూడూరు ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించే సమయంలో బాలుడి శరీరంపై గాయాలు లేవని, లోపల పరిస్థితి ఏమిటనే విషయం తెలుసుకునేందుకు అవయవాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు వైద్యులు తెలిపారు. గిరిజనుడి నుంచి సమాచారం రాబట్టేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేదని పోలీసులు చెబుతున్నారు. బాలుడి కిడ్నాప్ వెనుక ఉన్న అసలు విషయాన్ని పోలీసులు వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం

- దారి కోసం ప్రభుత్వ స్థలంలోని రేకుల షెడ్ కూల్చివేత
- మిన్నకుండిన అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిల్లకూరు పంచాయతీ బందెల(పశువుల) దొడ్డిలో ఉన్న రేకుల షెడ్‌ను ధ్వంసం చేసి, దర్జాగా ఆక్రమించుకున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడానికి కూడా సాహసించలేదు. గ్రామంలోని అధికార పార్టీకి చెందిన బడా నాయకులు అండతో ఆ పార్టీ సానుభూతి పరుడైన ఓ వ్యక్తి తాను నిర్మించుకునే ఇంటికి దారి కోసమని రూ.లక్షల విలువ చేసే 25 అంకణాల ప్రభుత్వ స్థలంలోని రేకుల షెడ్‌ను ధ్వంసం చేసి, ఆక్రమించుకుని, పనులు చేసుకుంటున్నాడు. చిల్లకూరులోని గ్రామ సచివాలయ సిబ్బందిలో ఎవరో ఒకరు ప్రశ్నిస్తే మీ పని మీరు చేసుకోండి ఏదైనా అయితే మేము చూసుకుంటామని అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు సమాచారం. దీనిపై గ్రామంలోని వారు మండల అధికారులకు సమాచార ఇస్తే తమకు సంబంధం లేదని, చిల్లకూరు పంచాయతీని గూడూరు మున్సిపాలిటీలో విలీనం చేసినందున ఆస్తుల పరిరక్షణ బాధ్యత వారిదేనని చేతులు దులుపుకున్నారు. బందెల దొడ్డిని తొలగించిన విషయంపై గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా గ్రామస్తుల నుంచి సమాచారం అందిందని, దీనిపై తమ సిబ్బంది పంపి, నివేదికలను తేవాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ఇలంగోవన్ మృతదేహం

తడ: మండలంలోని కారూరు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ కొండపనాయుడు కథనం మేరకు.. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా, పుదువాయల్ గ్రామానికి చెందిన ఇలంగోవన్(18) పొన్నేరిలో డిగ్రీ చదువుతున్నాడు. వరదయ్యపాళెం వద్ద ఉన్న వాటర్ ఫాల్స్ చూసేందుకు ప్లాన్ చేసి కాలేజీకి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి, తన చెల్లెలు స్కూటీలో మిత్రుడు సంతోష్‌తో కలిసి మంగళవారం ఉదయం వాటర్ ఫాల్స్‌కి వెళ్లాడు. తిరుగు ప్రయాణం ఆలస్యం కావడంతో వేగంగా ఇంటికి వెళ్లే క్రమంలో కారూరు గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాద సమయంలో స్కూటీ వెనుక కూర్చుని ఉన్న ఇలంగోవన్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడగా, స్కూటీ నడుపుతున్న సంతోష్ కూడా గాయపడ్డాడు. ప్రమాదం అనంతరం స్థానికులు వీరిని శ్రీసిటీ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తమిళనాడుకు తరలిస్తున్న సమయంలో ఇలంగోవన్ ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని రామాపురం వద్ద మృతి చెందాడు. దీనిపై మృతుని కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు

వీరట్ కుస్తీ పోటీలకు తిరుపతి క్రీడాకారులు


కలెక్టర్‌ను కలిసిన కుస్తీ క్రీడాకారులు

తిరుపతి అర్బన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌లో ఈ నెల 23, 27 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు తిరుపతి జిల్లా నుంచి 24 మందిని బాలబాలికలను ఎంపిక చేశారు. ఆ మేరకు వారంతా జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ నేతృత్వంలో కలిశారు. వారితోపాటు డీఈఓ వి.శేఖర్ ఉన్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కృష్ణా జిల్లాలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17, అండ్-19 బాలబాలికలకు కుస్తీ పోటీలు నిర్వహించారు. అందులో తిరుపతి జిల్లాకు చెందిన క్రీడాకారులు 24 బంగారు పతకాలు, 19 వెండి పతకాలు, 19 రజిత పథకాలు మొత్తంగా 62 పథకాలను సాధించారు. వీరంతా కలెక్టర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో కుస్తీ కోచ్ ఉదయ, డీఎస్ఏ కోచ్ సాయిసుమతి, వినోద్, యహాజీజ్, ప్రేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలో నకిలీ వరి విత్తనాలు విక్రయిస్తూ రైతులను నిలువునా దోపిడీ చేస్తున్న ప్రైవేట్ విత్తన విక్రయ దుకాణాల ఆగడంపై 'నకిలీల బెడద.. రైతులకు గుండె దడ' అన్న శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం సత్యవేడు, వరదయ్యపాళెం ఏఓలు మురళీ, ద్వారకానాథ్, ఏఈఓ ప్రవీణ్, ఇతర సిబ్బంది గురువారం సాయంత్రం విస్తృతంగా వరదయ్య పాళెంలోని ప్రైవేటు విత్తన విక్రయ దుకాణలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న వరి విత్తనాలను సీజ్ చేసి, అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దుకాణాల్లో ఉన్న విత్తనాలకు సంబంధించి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ రిపోర్టులో 100కు 80 శాతం విత్తనాలు మొలకలు వస్తేనే సంబంధిత విత్తనాలను విక్రయించాలని, అప్పటివరకు దుకాణాల్లో విత్తనాలను విక్రయించకూడదని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఏడీఏ తెలిపారు. అంతేకాక గురువారం సత్యవేడు వ్యవసాయశాఖ కార్యాలయంలో పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన విత్తన విక్రయ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో స్టాకు రిజిస్టర్లు పరిశీలిస్తామన్నారు. రైతులకు ఇబ్బంది కలిగేలా ఏ డీలర్ వ్యవహరించినా కఠిన చర్యలకు వెనుకాడబోమని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ

తిరుపతి క్రైం: నగరంలో బుధవారం తెల్లవారి జామున కొర్లగుంట సంజయ్య గాంధీకాలనీలో సాయమ్మ(67) అనే ఓ వృద్ధురాలు ఇంట్లోకి నలుగురు వ్యక్తులు చొరబడి చోరీ చేశారు. సాయమ్మకు భర్త, పిల్లలు లేరు. ఒక్కటే నివాసం ఉంటుంది. ఈ విషయం గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఇంట్లోకి చొరబడి 7 తులాలు బంగారం, రూ. 7లక్షల నగదు చోరీ చేశారు. దీంతో ఆమె వారి బంధువుల సాయంతో ఈస్ట్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. బుధవారం తెల్లవారు జామున నలుగురు వ్యక్తులు బంగారంతోపాటు నగదును దోచుకుపోయారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ భవనం స్థల వివాదం


తారకరామానగర్‌లో రెడ్డెప్పపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నాయకుడు బుజ్జినాయుడు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్‌లో అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలంలో చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణ పనులను బుధవారం టీడీపీ నాయకులు అడ్డుకుని, దౌర్జన్యం చేశారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడికి దిగారు. దీనిపై దళిత సంఘాల నాయకులతో కలసి రాత్రి రేణిగుంట పోలీసులకు రెడ్డెప్ప అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. వివరాలు.. తారకరామానగర్‌లో 2018లో 30 సెంట్లు స్థలం కేటాయించారని దళిత సంఘం నాయకుడు రెడ్డెప్ప తెలిపారు. అయితే ఈ స్థలంలో తాత్కాలిక గుడిసెను నిర్మించామని, ప్రస్తుతం స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రహరీ నిర్మాణ పనులు చేస్తుండగా, గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బుజ్జినాయుడు, బాలాజీ, వాసు, మునిరాజ, మణి మరి కొందరు అక్కడకు వచ్చి పనులను అడ్డుకున్నారన్నారు. ఎందుకు దౌర్జన్యం చేస్తున్నారని ప్రశ్నిస్తే తనపై మూకుమ్మడిగా దాడికి దిగి, కులం పేరుతో దుర్భాషలాడారని వాపోయారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు పుణ్యమూర్తి ఆధ్వర్యంలో ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం దళిత సంఘం నాయకులతో కలసి రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీలకు పుదూరు కార్యదర్శి


వెంకటరావును అభినందించిన కార్యదర్శులు

నాయుడుపేట టౌన్ : మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈ నెల 12 13 తేదీల్లో జరిగే అంతర్జాతీయ ఓపెన్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు పుదూరు పంచాయతీ కార్యదర్శి జీ వెంకటరావు ఎంపికయ్యారు. అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు దేశం తరపున ఆడేందుకు వెళుతున్న వెంకటరావును పలువురు కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు బుధవారం నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, అభినందించారు. నాయుడుపేట పట్టణంలోని ఎల్‌ఏ సాగరం వద్ద నివాసం ఉన్న వెంకటరావు క్రీడాల్లో మేటిగా రాణిస్తున్నారు. 2024 ఏప్రిల్ నెలలో ముంబాయిలో జరిగిన నేషనల్ మీట్ అథ్లెటిక్ సెలక్షన్ పోటీల్లో వెంకటరావు లాంగ్‌జంప్, హైజంప్, జావెలిన్ త్రో క్రీడల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అలాగే 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ప్రథమంలో నిలిచి బంగారు పతాకం సాధించారన్నారు. ఈ క్రమంలోనే అంతర్జాతీయస్థాయిలో మలేషియాలో జరిగే పోటీలకు వెంకటరావు ఎంపికైనట్లు వెల్లడించారు. వెంకటరావును అభినందించిన వారిలో మేనకూరు, కల్లిపేడు పంచాయతీ కార్యదర్శులు ఆశోక్, సుమన్ సచివాలయ సిబ్బంది పరమశివయ్య, పులి నరేష్, వెలుగు సీసీ శ్రీని వాసులు తదితరులు ఉన్నారు.